ఇక పక్కాగా భూముల వివరాలు

- పెనమలూరు మండలంలో ఏడు గ్రామాల్లో రీ సర్వే
- 20 వేల ఎకరాల్లో సర్వే చేయనున్న అధికారులు
- వంద రోజుల్లో పూర్తిచేసేందుకు సన్నాహాలు


వణుకూరులో భూ రీసర్వేకు వీఆర్వోకు పత్రాలు అందజేస్తున్న రైతులు

పెనమలూరు: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా పెనమలూరు మండలంలో భూముల రీసర్వే ప్రక్రియను రెవెన్యూ అధికారులు ప్రారంభించారు. రాష్ట్ర ప్రభుత్వం భూములు రీ సర్వే చేయాలని ఆదేశించింది. దీంతో మండల పరిధిలో రీ సర్వేకు రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. పెనమలూరులో పరిధిలో ఏడు గ్రామాల్లో దాదాపు 20 వేల ఎకరాలను రీసర్వే చేయనున్నారు.

రైతులు డాక్యుమెంట్లు ఇవ్వాలి

సర్వే సమయంలో రైతులు డాక్యుమెంట్లు ముందుగా ఇవ్వాలని రెవెన్యూ అధికారులు కోరుతున్నారు. డాక్యుమెంట్లు ముందుగా ఇవ్వడం వల్ల రెవెన్యూ రికార్డుల్లో వివరాలను సమగ్రంగా తనిఖీ చేస్తామని పేర్కొంటున్నారు. భూమి ఎవరి అనుభవంలో ఉంది, అడంగల్‌లో భూమి ఎవరి పేరున నమోదయింది, పార్టిషన్ చేసుకుంటే మ్యూటేషన్ జరిగిందా అన్న వివరాలను పరిశీలిస్తారు. ఒక వేళ భూ యజమాని మృతి చెంది ఉంటే అతని కుటుంబ సభ్యులకు రికార్డులు స్వచ్ఛీకరణ చేస్తారు. రెవెన్యూ అధికారులు డాక్యుమెంటుల రికార్డులు పరిశీలించి యజమానులకు తగిన సూచనలు, సలహాలు ఇస్తారు. డాక్యుమెంట్లలో భూమి ఒక సర్వే నంబర్‌లో ఉండి రెవెన్యూ రికార్డులో తేడాలు ఉంటే పరిశీలించి కొత్త సర్వే నంబర్లు

గ్రామం	సర్వే నంబర్లు	సర్వే చేయాల్సిన భూమి విస్తీర్ణం ఎకరాల్లో
పెదపులిపాక	269	2395.35
తాడిగడప	212	1433.89
పెనమలూరు	319	1642.43
చోడవరం	467	4071.81
గంగూరు	284	1315.62
వణుకూరు	440	2164.06
గోసాల	149	830.31

కేటాయిస్తారు. రెవెన్యూ రికార్డులు అన్ని సరిచేసిన తరువాత రీ సర్వే వివాదాలు లేకుండా చేయడం సులభతరం అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఫీల్డు మ్యాప్, డ్రోన్ ఇమేజ్ ఆధారంగా రీసర్వే జరుపుతారు. వంద రోజుల్లోనూ రీ సర్వే ప్రక్రియను పూర్తి చేయనున్నారు.

మండలంలో రీసర్వే ఒక చాలెంజ్..

పెనమలూరు మండలంలో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. భూముల ధరలు కోట్ల రూపాయలు పలుకుతున్నాయి. దీంతో మండలంలో తరచుగా భూ వివాదాలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో రీసర్వే రెవెన్యూ అధికారులకు సవాల్‌గా మారింది. గ్రామాల్లో రియల్ ఎస్టేట్ పుంజుకోవటంతో భూముల ధరలు మండుతున్నాయి. పొలాలు ఎకరాల్లోనే నమోదయి ఉన్నా భూ విక్రయాలు మాత్రం గజాల్లో జరుగుతున్నాయి. గజం తేడా వచ్చిన అభ్యంతరాలు తలెత్తే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో రెవెన్యూ యంత్రాంగం చేపట్టిన రీసర్వేకు రైతులు, భూ యజమానులు పూర్తిగా సహకరిస్తే సకాలంలో రీసర్వే సిబ్బంది పూర్తి చేయగలుగుతారు.

సమర్థవంతంగా రీసర్వే..

వివాదాలకు తావులేకుండా రీ సర్వేను సమర్థంగా చేస్తాం. భూ యజమానులు తమ డాక్యుమెట్లను వీఆర్వోలకు ఇచ్చి రికార్డులు పరిశీలించుకోవాలి. మార్పులు, చేర్పులు, పార్టీషన్‌లను చట్టబద్ధంగా చేస్తాం. శాస్త్రీయంగానే రీ సర్వే చేసి భూములకు హద్దులు నిర్ణయిస్తాం.

– టి.వి.సతీష్, తహసీల్దార్, పెనమలూరు

ముమ్మరంగా ఫీవర్ సర్వే


గొల్లనపల్లి గ్రామంలో ఫీవర్ సర్వే నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

గన్నవరంరూరల్: మండలంలోని గ్రామాల్లో సోమవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే ముమ్మరంగా చేపట్టారు. గ్రామాల్లో ఏఎన్‌ఎంల పర్యవేక్షణలో ఆశా కార్యకర్తలు, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి జ్వరాల బాధితుల వివరాలను నమోదు చేశారు. మండల వైద్యాధికారి జె.సంధ్య మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లాలని ఆదేశించారు. జ్వరాలు ఉంటే నమోదు చేయాలని, వారిని పీహెచ్‌సీలకు పంపాలని చెప్పారు. ముస్తాబాద, పెద్ద అవుటపల్లి, ఆత్కూరు పీహెచ్‌సీల పరిధిలోని మండల గ్రామాల్లో సర్వే జరిగింది.

స్పందనలో మూడు అర్జీలు అందజేత


అర్జీదారుడితో మాట్లాడుతున్న తహసీల్దార్ జాహ్నవి

విజయవాడరూరల్: స్పందనలో మూడు అర్జీలు వచ్చాయని తహసీల్దార్ పి.జాహ్నవి తెలిపారు. గొల్లపూడిలోని తన స్థలాన్ని సర్వే చేయించాలని నూతక్కి నిరంజనరావు, నున్న గ్రామంలో అడంగల్ కాపీ కోసం కానూరు గ్రామానికి చెందిన నేరెళ్ల వెంకటసుబ్బారావు, కొత్తూరు తాడేపల్లి గ్రామానికి చెందిన బద్రి వెంకట్రావ్, బద్రి అంబేడ్కర్లు స్థలం సర్వే చేయాలని దరఖాస్తు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు, హౌసింగ్ ఏఈ రామకృష్ణ, మెడికల్ సిబ్బంది, రీ సర్వే డీటీ ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

కాలువ కట్ట రోడ్డు నిర్మాణానికి శ్రీకారం


రోడ్డు మార్కింగ్‌ను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ ప్రకాశరావు

పెనమలూరు: మండలంలోని తాడిగడప శ్రీనివాసానగర్ కాలువ కట్టపై సిమెంట్ రోడ్డు నిర్మాణానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. కాలువ కట్టపై సీసీ రోడ్డు నిర్మించాలని చాలా కాలంగా స్థానికులు కోరుతున్నారు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి చొరవ తీసుకుని రూ.80 లక్షలు మంజూరు చేయించడంతో రోడ్డు నిర్మాణానికి మోక్షం కలిగింది. సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ వంతెన నుంచి యనమలకుదురు హద్దు జన్మభూమి వంతెన వరకు శ్రీనివాసానగర్ పరిధిలో సిమెంట్ రోడ్డు నిర్మిస్తారు. సీసీ రోడ్డు పనులకు మునిసిపల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు సోమవారం మార్కింగ్ చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ ఎస్.ప్రకాశరావు సమక్షంలో రోడ్డు మార్కింగ్ చేశారు. 963 మీటర్ల పొడవు, నాలుగున్నర మీటర్ల వెడల్పుతో ఈ రోడ్డు నిర్మిస్తామని ప్రకాశరావు తెలిపారు.

కవయిత్రి మొల్లమాంబను స్మరించుకోవాలి


కేక్ కట్ చేస్తున్న శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సువర్ణరాజు తదితరులు

నున్న(విజయవాడరూరల్): రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి అనువదించిన తొలి మహిళా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబను స్మరించుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం నున్న గ్రామంలోని శాలివాహన సంఘం ఆధ్వర్యంలో కవయిత్రి మొల్లమాంబ 283వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కె.సువర్ణరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి, కార్పొరేటర్లు అలంపూరు విజయలక్ష్మి, మోదుగుల తిరుపతమ్మ, రామవరప్పాడు సర్పంచ్ వర్రి శ్రీదేవి, నున్న ఉప సర్పంచ్ కలకోటి బ్రహ్మానందరెడ్డి, స్థానికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశైల దేవస్థానం నిత్యాన్నదానం కోశాధికారి, ఎన్టీఆర్ జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాసరావు దంపతులను సత్కరించారు.

వైఎస్సార్ సీపీ గన్నవరం మండల కన్వీనర్‌గా నీలం

గన్నవరం: వైఎస్సార్ సీపీ గన్నవరం మండల కన్వీనర్‌గా నీలం ప్రవీణ్‌కుమార్(బాలు) నియమితులయ్యారు. మండలంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు సామాజిక న్యాయాన్ని పాటిస్తూ ఎమ్మెల్యే వంశీమోహన్ సూచించిన బాలును నియమిస్తూ సోమవారం రాష్ట్ర కమిటీ నియామక ఉత్తర్వులను జారీచేసింది. పార్టీ ఆవిర్భావం నుంచి ప్రవీణ్‌కుమార్ క్రియాశీలకంగా వ్యవహరించడంతో పాటు గన్నవరం సర్పంచ్‌గా పనిచేశారు. బాలు సేవలను గుర్తించి మండల కన్వీనర్‌గా నియమించారు. ఈ సందర్భంగా బాలును ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్‌రాణి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ గౌసాని, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు కాసరనేని గోపాలరావు తదితరులు అభినందించారు.

అంతర్గత నైపుణ్యాలు పెంపొందించుకోవాలి


విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న మల్లిక

రామవరప్పాడు: విద్యార్థులకు ఉన్నత విద్యతో పాటు అంతర్గత నైపుణ్యాలు అవసరమని శ్రీ హర్ష ట్రైనర్ ప్రాజెక్ట్ మేనేజర్ మల్లిక అన్నారు. విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు ఎస్సార్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న విజయ మహిళ ఫార్మసీ కళాశాలలో ఊర్జా ప్రాజెక్ట్‌లో భాగంగా వాయిస్ ఫర్ గర్ల్స్ సంస్థ ఆధ్వర్యంలో భవిష్యత్ కార్యాచరణపై సోమవారం శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సురక్షణ, సంరక్షణ, ఆరోగ్యం, స్త్రీ హక్కులు తదితర అంశాలపై మల్లిక అవగాహన కల్పించారు. మల్లిక మాట్లాడుతూ మారుతున్న ప్రపంచీకరణ నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానం విప్లవాత్మకమైన మార్పులు సంతరించుకుంటుందన్నారు. దీనికి అనుగుణంగా విద్యార్థులు కూడా తమ తమ కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకుని తమ లక్ష్యాలను సాధించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మలత మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. 8 రోజుల పాటు జరిగే ఈ శిక్షణ కార్యక్రమంలో విద్యార్థినుల భవిష్యత్ కార్యాచరణకు అవసరమయ్యే అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు టవల్స్ పంపిణీ



రామవరప్పాడు: శ్రీ వాసవీ పరివార్ ఇంటర్నేషనల్ సేవకులు జూలూరు నాగేశ్వరరావు తండ్రి రంగారావు జ్ఞాపకార్థం ప్రసాదంపాడు పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు 60 మందికి సోమవారం టవల్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ మన ఆరోగ్యాన్ని కాపాడేందుకు పారిశుద్ధ్య కార్మికులు ముఖ్య భూమిక పోషిస్తున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, సర్నాల బాలాజీ, వాసవీ సేవా సంఘం కార్యవర్గ సభ్యులు కోట రామకృష్ణారావు, శిఖాకొల్లి యల్లమందయ్య, గోనుగుంట్ల శ్రీనివాసరావు, మాదాల సుబ్బారావు పాల్గొన్నారు.

మానసిక వికాస కేంద్రానికి వితరణ


సిమెంట్ రాళ్లు అందజేస్తున్న దాతలు

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో ఉన్న స్పందన మానసిక వికాస కేంద్రం భవన నిర్మాణానికి విజయవాడకు చెందిన శ్రీసాయి జ్ఞానయజ్ఞం ట్రస్ట్ రూ. 21,500 విలువైన వెయ్యి సిమెంట్ రాళ్లను విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు సోమవారం ట్రస్టు అధ్యక్షులు పబ్బిశెట్టి తిరుపతిరావు సిమెంట్ రాళ్లను వికాస కేంద్రానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికాస కేంద్రం ద్వారా దివ్యాంగులకు ఉచిత విద్య, వైద్యం, భోజనం, రవాణా సదుపాయలను కల్పించడం అభినందనీయమన్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ మాట్లాడుతూ... అతి చిన్న వయసులోనే సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్న ట్రస్ట్ నిర్వాహకుడు తిరుపతిరావు ఆదర్శనీయులని తెలిపారు. ట్రస్ట్‌కు చెందిన కృష్ణచైతన్య, శ్రీనివాసన్, శేషుకుమార్, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకోవాలి


విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న బాకీ బాబు, రాజ్యలక్ష్మి తదితరులు

కంకిపాడు: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి సూచించారు. కంకిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాకీ బాబు, రాజ్యలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థుల స్థాయి పెంపొందించేలా బోధన సాగాలన్నారు. పదో తరగతి ఫలితాలను నూరుశాతం సాధించేలా ప్రణాళికాబద్ధంగా సాగాలన్నారు. టాటా బిల్డింగ్ ఇండియా సంస్థ ఇటీవల నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలను అందించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మద్దాలి రామచంద్రరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ‘కన్నవారి దీవెన’


విద్యార్థినులను ఆశీర్వదిస్తున్న తల్లులు

గన్నవరం రూరల్: తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి చదువు పట్ల విద్యార్థులు శ్రద్ధ చూపాలని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ముత్యాల సౌజన్య సూచించారు. సోమవారం పాఠశాలలో కన్నవారి దీవెన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా కన్నవారి దీవెన కార్యక్రమంలో 10వ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థుల తల్లిదండ్రుల పాదాలకు నమస్కరించి, వారి ఆశీర్వాదాలు స్వీకరించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుకుంటున్న సమయంలోనే తల్లిదండ్రులు, సమాజం పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంచుకున్న లక్ష్యాలు సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని సూచించారు. గురుకులాల్లో చదువుకున్న ఎంతో మంది పాఠశాలలకు, కళాశాలలకు వన్నె తెస్తూ ఉన్నత ఉద్యోగాలు సాధించాలని, వారిని ఆదర్శంగా తీసుకుని పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలన్నారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్న పత్రాలు



పెనమలూరు: ఇంటర్‌మీడియెట్ ప్రశ్నపత్రాలు పెనమలూరు పోలీస్‌స్టేషన్‌కు సోమవారం చేరాయి. ఈ నెల 15 నుంచి 29వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్న విషయం విదితమే. రెండు రోజుల క్రితం కూడా కొన్ని ప్రశ్న పత్రాలు పోలీస్‌స్టేషన్‌కు వచ్చాయి. ఇప్పుడు మరికొన్ని రావటంతో వాటిని పోలీస్‌స్టేషన్‌లో భద్రపరిచారు. కస్టోడియన్‌లు షేక్ సుల్తానా, జి.అనురాధ మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్‌లో ఇప్పటికే కొన్ని ప్రశ్న పత్రాలు ఉన్నాయని, మరి కొన్ని రావాల్సి ఉందని వివరించారు. మండలంలో 15 కేంద్రాల్లో ఇంటర్ పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

డీపీఎస్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని ఢిల్లీపబ్లిక్‌స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. పలువురు విద్యార్థులు పాశ్చాత్య, సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించి చూపరులను ఆకట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విసన్నపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరింటెండెంట్ రమేష్ మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులతో తగినంత సమయం గడపాలన్నారు. వారి ఆలోచనలకు విలువనిస్తూ ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ దేవిడ్‌రాజు, ప్రిన్సిపాల్ భువనేశ్వరన్, వైస్ ప్రిన్సిపాల్ సంజయ్ భాటియా, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడాలి



మాట్లాడుతున్న సయ్యద్ నూరుద్దీన్

రామవరప్పాడు: వక్ఫ్‌బోర్డును ప్రక్షాళన చేయడంతో పాటు రాష్ట్రంలో వేలాది ఎకరాల వక్ఫ్ ఆస్తులను కాపాడాలని ముస్లిం రైట్స్ అండ్ వెల్ఫేర్ వ్యవస్థాపక అధ్యక్షుడు సయ్యద్ నూరుద్దీన్ కోరారు. రామవరప్పాడులోని ముస్లిం రైట్స్ అండ్ వెల్ఫేర్ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూరుద్దీన్ మాట్లాడుతూ.. గత టీడీపీ ప్రభుత్వంలో భ్రష్టు పట్టించిన వక్ఫ్ బోర్డును మైనార్టీల పక్షపాతి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రక్షాళన చేస్తున్నారన్నారు. వక్ఫ్ బోర్డు పదవీకాలం ముగిసినందున అవినీతి రహిత అధికారిని రాష్ట్ర వక్ఫ్ బోర్డు స్పెషల్ ఆఫీసర్‌గా నియమించాలని విజ్ఞప్తి చేశారు. టీడీపీ హయంలో రాష్ట్రంలో పలుచోట్ల వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతానికి గురయ్యాయని ఆరోపించారు. నగరానికి చెందిన మాజీ డైరెక్టర్, టీడీపీ నాయకుని సోదరుడు వక్ఫ్ బోర్డులో అవినీతికి పాల్పడ్డాడని ఇతనిపై సీబీసీఐడీతో విచారణ జరిపించాలని కోరారు. సమావేశంలో మైనార్టీ నాయకులు మహమ్మద్ ఇంతియాజ్, షేక్ మస్తాన్, షేక్ హంజెర్, షేక్ షరీఫ్, బాజీ పాల్గొన్నారు.

తేలప్రోలులో సామాజిక తనిఖీ గ్రామసభ

ఉంగుటూరు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2021–22 ఆర్థిక సంవత్సరంలో తేలప్రోలులో రూ.89 లక్షలతో చేపట్టిన పనుల సామాజిక తనిఖీ గ్రామసభ సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభలో ఉపాధి పనుల వివరాలను వెల్లడించారు. కరోనా కష్టకాలంలో కూడా ఉపాధి హామీ ద్వారా కూలి పనులు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్పీ దాసరి కిరణ్, డీఆర్పీ రంజిత్ కుమార్, పి.గంగరాజు, కార్యదర్శి కృపాకుమార్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డును సందర్శించిన డీడీ

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతుల నుంచి కూరగాయల అమ్మకాలపై వసూలు చేస్తున్న యూజర్ చార్జీలపై తగిన విచారణ జరుపుతామని మార్కెటింగ్ శాఖ డెప్యూటీ డైరెక్టర్ శారదా రాణి తెలిపారు. బాపులపాడు మార్కెట్ యార్డును సోమవారం ఆమె సందర్శించారు. మార్కెట్ యార్డులో కూరగాయలు క్రయ, విక్రయాలు, కాటా నిర్వహణలను పరిశీలించారు. కూరగాయలకు సరైన గిట్టుబాటు ధర కల్పించాలని పలువురు రైతులు డీడీ శారదారాణికి విజ్ఞప్తి చేశారు. ప్రతి రోజు కూరగాయల అమ్మకపు ధరలు, యార్డుకు వస్తున్న రైతులు, ఎన్ని క్వింటాళ్ల విక్రయాలు జరుగుతున్నాయో తనకు పూర్తి నివేదిక అందజేయాలని గన్నవరం ఏఎంసీ కార్యదర్శి శివరామకృష్ణను ఆదేశించారు.

వైభవంగా గుడ్ల గౌరమ్మ ఉత్సవాలు


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మర్లపాలెం(గన్నవరం): మండలంలోని మర్లపాలెం శివారులో గుడ్ల గౌరమ్మ ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మర్లపాలెంతో పాటు పరిసరా గ్రామాల నుండి వేలాదిగా తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమారాధన చేపట్టారు.

క్లుప్తంగా

రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో వేంచేసి ఉన్న పార్వతి సమేత శ్రీ రామ లింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేకాభిషేకం చేశారు. స్వామి, అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

టెన్త్ ఉత్తీర్ణత పెంపునకు కృషిచేయాలి

పెనమలూరు: త్వరలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచడానికి విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ వంతు కృషి చేయాలని పెనమలూరు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని వై.దుర్గాభవాని కోరారు. పాఠశాలలో సోమవారం విద్యార్థుల తల్లిదండ్రులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఏడాది పాటు తరగతి గదుల్లో ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన చేశారన్నారు. ప్రభుత్వం కూడా విద్యార్థులకు అనేక పథకాలు అమలు చేసిందన్నారు. త్వరలో పబ్లిక్ పరీక్షలు జరుగుతున్నందున తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు అండగా నిలిచి ధైర్యం చెప్పాలని సూచించారు.

నలుగురు జూదరుల అరెస్టు

పెనమలూరు: మండలంలోని కానూరు పరిధిలో పేకాడుతున్న నలుగురిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. కానూరులో పేకాడుతున్నారని పెనమలూరు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఆ ప్రాంతంపై దాడిచేయగా నలుగురు జూదరులు పట్టుబడ్డారు. వారి వద్ద రూ.1710 నగదును పోలీసులు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

40 మంది వృద్ధులకు నేత్ర పరీక్షలు

కంకిపాడు: కంటి సమస్యలను ప్రాథమిక దశలో గుర్తించి పరిష్కరించుకోవాలని ఆప్తమాలిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ సూచించారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గొడవర్రులో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 40 మంది వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పరిశోధనలపై దృష్టి పెట్టాలి

పెనమలూరు: విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెడితే దేశ, విదేశాల్లో మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని అమెరికాకు చెందిన జార్జి మాసన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మూల్పూరి వెంకట్రావు సూచించారు. మండలంలోని గంగూరులో ఉన్న ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో అధ్యాపకులు, విద్యార్థులకు సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. వివిధ కంప్యూటర్ ప్రోగ్రామ్‌లపై పట్టు సాధించాలని పేర్కొన్నారు. మారుతున్న శాస్త్రీయ పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. పరిశోధనలపై ప్రత్యేక దృష్టి పెట్టి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డీన్ సత్యప్రసాద్, ఈసీఈ విభాగాధిపతి వంశీకృష్ణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



గన్నవరం: రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో గన్నవరం ప్రాంత విద్యార్థులు పలు పతకాలు సాధించారని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మడుపల్లి బాలకృష్ణమూర్తి తెలిపారు. స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో పతకాలు సాధించిన విద్యార్థులకు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిలకలూరిపేటలో జరిగిన ఈ పోటీల్లో గన్నవరానికి చెందిన 26 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీరిలో 10 మంది ప్రథమం, మరో 10 మంది ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారని తెలిపారు. అనంతరం పతకాలు సాధించిన బాలబాలికలను, కోచ్ వెంకట్రావును వాకర్స్ అభినందించారు. అసోసియేషన్‌కు చెందిన కెఎస్.బాబూరావు, చిమట రామారావు, వై.శ్రీనివాసరావు, వీవీ. ఎలీషా, ముక్కామల సుబ్బారావు పాల్గొన్నారు.

శాసనమండలి చైర్మన్ పేషీకి మద్దూరు ఈఓ బదిలీ

కంకిపాడు: రాష్ట్ర శాసనమండలి చైర్మన్ పేషీకి మద్దూరు పంచాయతీ కార్యదర్శి చింతా కిరణ్ కుమార్ బదిలీ అయ్యారు. ఈ మేరకు కలెక్టర్ రంజిత్‌బాషా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి బాధ్యతల నుంచి కిరణ్‌కుమార్‌ను ఇన్‌చార్జి ఎంపీడీఓ దుర్గాప్రసాద్ రిలీవ్ చేశారు. గొడవర్రు ఈఓ ప్రసాద్‌కు మద్దూరు బాధ్యతలు అప్పగించారు. కిరణ్‌కుమార్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ శాసనమండలి చైర్మన్ వ్యక్తిగత సహాయకుడిగా తనకు నియామక ఉత్తర్వులు అందాయన్నారు.